క్లుప్తంగా

నూతన రథం ట్రయల్ రన్ విజయవంతం



బాపట్ల: శ్రీభావన్నారాయణస్వామి రథోత్సవం సందర్భంగా శనివారం ట్రయల్ రన్‌ను నిర్వహించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు ట్రయల్ రన్‌ను ప్రారంభించారు. పోలీసు, మున్సిపాలిటీ, విద్యుత్‌శాఖ అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రథం బజారు నుంచి ఆంజనేయ స్వామి దేవాలయం వరకు ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించారు. ఈ నెల 12వ తేదీన రథోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

యువ నటులకు గంగాధరరావు స్ఫూర్తి ప్రదాత



బాపట్ల: శతాధిక నాటక రచయిత డాక్టర్ కొరప్రాటి గంగాధరరావు యువతకు స్ఫూర్తి ప్రదాత అని సాహితీ భారతి సభ్యులు దగ్గుమల్లి శ్యామ్యూల్ పేర్కొన్నారు. బాపట్ల జమేదారు పేటలోని సాహితీ భారతి కార్యాలయంలో గంగాధర్ రావు 103వ జయంతి సభ శనివారం జరిగింది. శ్యామ్యూల్ మాట్లాడుతూ.. 1950- 60 కాలంలో తెలుగు రాష్ట్రాలలో ప్రతినిత్యం ఏదో ఒక వేదికపై కొరప్రాటి వారి నాటక ప్రదర్శన జరుగుతూనే ఉండేదని తెలిపారు. నాటికలే కాకుండా దాదాపు 20 నవలలు కూడా ఆయన రచించారని పేర్కొన్నారు. దాదాపు 130 నాటక, నాటికలు రచించినట్లు తెలిపారు. 12 రేడియో నాటికలు, నాటక రంగంపై 65 వ్యాసాలు రచించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నరసింహ వర్మ, అబ్దుల్ ఖాదర్ జిలాని, మాల్యాద్రిరావు తదితరులు ఉన్నారు.

యోగాతో ఆరోగ్యానికి మేలు



బాపట్ల టౌన్: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని రాష్ట్ర యోగా అసోసియేషన్ చీఫ్ సెక్రటరీ అల్లాడి రవికుమార్ తెలిపారు. పట్టణంలోని వివేకనందకాలనీ ఆంజనేయస్వామి గుడి సమీపంలో మాజీ సైనికుడు నంగు రాం ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం యోగా వేసవి శిబిరం ప్రారంభించారు. చిన్నారులు, మహిళలతో పలు యోగాసనాలను రవికుమార్ సాధన చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా చేయటం వలన మానసిక ప్రశాంతతో పాటు శారీరక సౌష్టవం లభిస్తుందన్నారు. దీనికి వయస్సుతో సంబంధం లేదన్నారు. చిన్నారులు చురుగ్గా ఉంటారన్నారు. శిక్షణ జూన్ 10వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన చిన్నారులు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దేశ క్షేమం కోసం పూజలు

తెనాలిటౌన్: దేశ సరిహద్దుల్లో పాకిస్తాన్ చేస్తున్న దుర్ఘాతలను మన భారత జవాన్‌లు శక్తివంచన లేకుండా ఎదుర్కొని విజయం సాధించాలని పలువురు బీజేపీ నాయకులు ఆకాంక్షించారు. శనివారం రూరల్ మండలం అంగలకుదురు, నందివెలుగు గ్రామాల్లో కూటమి నాయకులు దేవాలయాల్లో పూజలు నిర్వహించి అభిషేకాలు చేయించారు. దేశ క్షేమం కోసం అంగలకుదురులోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో అభిషేకం చేయించినట్లు బీజేపీ తెనాలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కఠారి వాసుదేవ నాయుడు తెలిపారు. అదే విధంగా నందివెలుగు గ్రామంలోని శ్రీ కనకదుర్గమ్మ తల్లి దేవస్థానంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించినట్లు బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు తోటకూర కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో కె.నందకిషోర్, ఎం.వీరయ్య, కె.ప్రసాద్, ఎం.జనార్ధన్, తదితరులు ఉన్నారు.

గంగానమ్మ దేవస్థానంలో విశేష పూజలు

తెనాలిటౌన్: గంగానమ్మతల్లి ఆశీస్సులు ప్రజలందరిపై మెండుగా ఉండాలని తెనాలి శాసన సభ్యులు, రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకాంక్షించారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో వేంచేసియున్న గంగానమ్మతల్లి దేవస్థాన 16వ వార్షికోత్సవ వేడుకలు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా శనివారం మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు దేవస్థానానికి చేరుకుని అమ్మవారిని దర్శించి విశేష పూజలు నిర్వహించారు. దేశం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆలయ వంశపారంపర్య ట్రస్టీలు జి.రాధిక, పావని, గంగానమ్మయూత్ సభ్యులు అతిథులను సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

మామిడి మాగిద్దామిలా..!

- జిల్లాలో జోరుగా సాగుతున్న కోతలు
- సహజ సిద్ధంగా పక్వానికి తెస్తేనే ఆరోగ్యం



బాపట్ల : జిల్లాలో మామిడి సీజన్ జోరందుకుంది. పలు మార్కెట్‌లలోకి పండ్లు పెద్ద ఎత్తున వస్తున్నాయి. కాయలను కోయటం, మాగించడంలో రైతులు, వ్యాపారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్యకరమైన పద్ధతుల్లో మాగిస్తేనే రైతులకు లాభాలతోపాటు వినియోగదారులకు ఆరోగ్యం లభిస్తుంది. బాపట్లలో రేపల్లె, వేమూరు, బాపట్ల, చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 2,200 ఎకరాల్లో తోటలు ఉన్నాయి. కోతలు, మెళకువలు, కాయను మాగబెట్టే విధానాన్ని వ్యవసాయాధికారి చంద్రశేఖర్ వెల్లడించారు.

కాయలు కోసే పద్ధతి

మామిడి పిందె ఏర్పడిన తర్వాత పూర్తిగా పక్వానికి రావడానికి 120 నుంచి 150 రోజులు సమయం పడుతుంది. కాయ లోపలిభాగం పసుపురంగులో మారిన తర్వాతే వాటిని కోయాలి. కాయలను 10 సెం.మీ. తొడిమి ఉండేలా వల ఉన్న దోనేతో కోయాలి. తర్వాత సొన (జీడి) పూర్తిగా కారేంత వరకు కాయలను కిందనే ఉంచాలి. ముదిరిన కాయలను ఉదయం 10 గంటలలోపు, సాయంత్రం 5 గంటల తర్వాత కోసి ఆరబెట్టాలి. సొన (జీడి) కాయలను తొడిమి వైపు ఉంచాలి. అవకాశం ఉంటే కాయలను నీటిలో శుభ్రం చేస్తే మంచిది. ఆ నీటిలో టీపాల్ లేక సాండోవిట్ ఒక ఎంఎల్ కలపాలి. కాయలను వాటిలో ముంచి ఆరబెట్టాలి. వేడి నీటిలో (52 డిగ్రీల సెంటీగ్రేట్ వద్ద) 3 నుంచి 4 నిమిషాలు ఉంచి శుభ్రం చేస్తే ఎక్కువకాలం నిల్వ ఉంటాయి. వేడి నీటిలో సోడియం హైపోక్లోరైడ్ లేక ప్రోక్లోరాజ్ 200 పీపీఎం కలిపితే శిలీంధ్రాలు ఆశించవు. కాయ బరువు బట్టి 200 - 250 గ్రాముల బరువు ఉన్న వాటిని ఒక గ్రేడ్‌గా, 300 - 350 గ్రాముల బరువు ఉన్న వాటిని ఇంకో గ్రేడ్‌గా, మిగిలిన వాటిని మరో గ్రేడ్‌గా తయారు చేసుకోవాలి.

మాగబెట్టే విధానం ఇదీ..

ఒక గదిలో బోదగడ్డికానీ, వరిగడ్డికానీ పరిచి వాటిపై కాయలను పేర్చి పైన గడ్డి కప్పాలి. ఇలాగే చేస్తే రెండు, మూడు రోజుల్లోనే కాయలు మాగుతాయి. మంచి నాణ్యత కలిగి ఉంటాయి. దీంతోపాటు మామిడికి మంచి రంగు తెప్పించడానికి అవసరమైతే ఇథైల్‌ను వాడవచ్చు. ఇది రసాయనం కాకపోవడంతో ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవు. లీటరు నీటికి ఒక 1 నుంచి 1.8 ఎంఎల్ వరకు ఇథైల్ ఉపయోగించి కాయలను మాగబెట్టవచ్చు. ఇథైల్‌ను 52 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద కలిపి కాయలను 5 నిమిషాలపాటు ముంచి తీసి ఆరపెట్టాలి. మామిడి పండ్లను చెక్క పెట్టలో కాకుండా, సీఎఫ్‌బీ పెట్టెల్లో 5 నుంచి 10 కిలోల పండ్లను ఉంచి రవాణా చేయవచ్చు. ఏప్రిల్ మాసంలో వచ్చే కాయలు పూర్తిస్థాయిలో ఎదుగుదల లేకపోవడం వలన పండ్లలో నాణ్యత ఉండదు. వీటిని మాగపెట్టేందుకు కార్బైడ్‌ను ఉపయోగించి మార్కెట్‌లో విక్రయిస్తారు. మే, జూన్ నెలల్లో వచ్చే పండ్లు రుచిగా, నాణ్యతగా ఉంటాయి.

శీతలీకరణ నిల్వ

మామిడిని శీతలీకరణ గిడ్డంగుల్లో 10 నుంచి 12 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద 80 నుంచి 90 శాతం తేమలో దాదాపు 30 రోజులు నిల్వ ఉండవచ్చు. బాగా పక్వానికి వచ్చిన మామిడికాయలను 5 నుంచి 6 రోజుల్లోనే మాగుతాయి. ముదిరిన కాయలను ఇళ్లలోనే గాలి చొరబడకుండా వరిగడ్డి వేసి మాగ పెట్టుకోవచ్చు. ఇందుకు వెదురు బుట్టలను ఉపయోగించుకుంటే మంచిది. 10 ఎంఎల్ ఇథైల్, 2 గ్రాముల సోడియం హైడ్రాక్సైడ్‌ను 5 లీటర్ల నీటిలో కలిపి వెడల్పు మూతి గల పాత్రలో ఉంచి మామిడికాయలు కోసిన గదిలో ఉంచితే ఒక రోజులో కాయలు మాగుతాయి. మామిడికాయల గదిలో బొప్పాయి, అరటిపండ్లను ఉంచితే అవి ఇథైల్ వాయువు విడుదల చేయడంతో కాయలు త్వరగా మాగుతాయి.

కార్బైడ్‌తో ప్రమాదం

కాల్షియం కార్బైడ్‌తో పండ్లను మాగపెట్టడంతో అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయి. దీని నుంచి వచ్చే ఎసిటిలిన్ అనే రసాయనం మెదడుకు ఆక్సిజన్‌ను అందకుండా చేస్తుంది. కార్బైడ్‌లో ఉండే ఆర్సనిక్ భాస్వరంతో అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. కొంతమంది రైతులు, వ్యాపారులు కాయలు మాగబెట్టడానికి కాల్షియం కార్బైడ్‌ను అధికంగా ఉపయోగిస్తున్నారు. ఇలా మాగపెట్టడంతో కాయలకు రంగు ఉంటుందే కానీ రుచి ఉండదు. ఇవి పుల్లగా ఉంటాయి. పైగా ఇవి తింటే అనారోగ్యం పాలవుతారు.

పోషకాల రారాజు

పండ్లలో మామిడి రారాజు వంటిది. అత్యంత విలువైన పోషకాలు ఉంటాయి. ఇందులో విటమిన్ సీ 76, విటమిన్ ఏ 25, విటమిన్ బీ 6, ఇతర విటమిన్లు 11 శాతం ఉంటాయి. ఫైబర్ 9, రాగిధాతువు 9, పొటాషియం 7, మెగ్నీషియం 4 శాతం ఉంటాయి.

వీవీఐటీయూలో ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ



ఎన్‌సీసీ క్యాడెట్ల విన్యాసాలు

పెదకాకాని: ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో పాల్గొనడం ద్వారా దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్ తెలిపారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలాజికల్ విశ్వవిద్యాలయంలో 10 రోజులుగా నిర్వహిస్తున్న 10ఏ బెటాలియన్ బాలికల వార్షిక శిక్షణ శిబిరం ఘనమైన వేడుకలతో శనివారం ముగిసింది. వివిధ విద్యాసంస్థలకు చెందిన 426 మంది క్యాడెట్లు ఈ శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ.. ఈ శిక్షణ ద్వారా దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవచ్చని అన్నారు. తొలిసారిగా ఏర్పాటు చేసిన సాహసవిన్యాస పోటీలలో విద్యార్థులు ప్రదర్శించిన స్ఫూర్తి ప్రశంసనీయమన్నారు. ఈ శిక్షణ శిబిరంలో క్యాడెట్ల వ్యాయామం, సరుగు, యోగా, కవాతు ఆయుదాలపై అవగాహన, ఫైర్ ఫైటింగ్, సీపీఆర్, మ్యాప్ రీడింగ్, త్రివిధ దళాలకు సంబంధించిన అంశాలపై శిక్షణను అందించారు. ముగింపు వేడుకలను పురస్కరించుకుని క్యాడెట్లు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశ భక్తి గీతాలకు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి మేజర్ అవినాష్ సట్వాల్, వి.వి.ఐ.టి ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ ఎ.శ్రీవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

భావనారాయణుడి రథోత్సవానికి వేళాయె!

- రేపు ఉదయం 5 గంటలకు గురుడోత్సవం
- రథోత్సవం సాయంత్రం 3 గంటలకు



వేడుకలకు సిద్ధమైన స్వామి రథం



విద్యుత్ దీపాలంకరణలో స్వామివారి ఆలయం

పొన్నూరు: పొన్నూరులో ప్రసిద్ధిగాంచిన శ్రీ సుందవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావన్నారాయణ స్వామివారి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో కనులపండువుగా అలంకరించారు. ఈనెల 4న ప్రారంభమైన ఉత్సవాల్లో భావనారాయణుడు ప్రత్యేకంగా రోజుకో అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. సోమవారం ఉదయం 5 గంటలకు గురుడోత్సవంతో కార్యక్రమాలు ప్రారంభంకానున్నాయి. మధ్యాహ్నం 12 గంటలకు బ్రాహ్మణ సమారాధన.. సాయంత్రం 3 గంటలకు నారాయణుడు ఉభయ దేవేరులతో అంగరంగ వైభవంగా రథంలో విహరించనున్నారు. సంబంధించిన ఏర్పాట్లను ఆలయ అధికారులు పూర్తి చేశారు. హిందూ జనజాగృతి సమితీ ఆధ్వర్యంలో పుష్పాలంకరణ చేయనున్నారు. ఆలయ ప్రాంగణం నుంచి ప్రారంభమయ్యే రథం వేడుక కసుకర్రు రోడ్డు వరకు కొనసాగనుంది. వివిధ ప్రాంతాల ప్రజలు వేలాదిగా తరలి వచ్చి ఉత్సవాన్ని తిలకించి స్వామివారిని దర్శించుకోనున్నారు.

ఆలయ అభివృద్ధికి దాతల సహకారం

విరాళంగా రూ.లక్ష విలువ చేసే స్టీల్ టేబుళ్లు, స్టీల్ కుర్చీలు, సిమెంట్ బల్లలు



దాతలకు స్వామి చిత్రపటం అందిస్తున్న ఉపకమిషనర్

పెదకాకాని: శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థాన అన్నప్రసాద వితరణ భవనంలో భక్తులు కూర్చొని అన్న ప్రసాదము స్వీకరించడానికి స్టీల్ టేబుళ్లు, స్టూల్స్‌ని దాతల సహకారంతో ఏర్పాటు చేసినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. గుంటూరు పీపుల్స్ ట్రామా అండ్ ఎమర్జెన్సీ హాస్పిటల్ డాక్టర్ కేసరి వెంకటేశ్వరరెడ్డి, వెంకట ప్రియాంక దంపతులు రూ.లక్ష విలువ చేసే 6 స్టీల్ టేబుళ్లు, 30 స్టూల్స్ శనివారం దేవస్థాన కార్యనిర్వాహణాధికారికి అన్నప్రసాద వితరణ భవనంలో అందించారు. దాతలకు ప్రత్యేక దర్శనం, ఆలయ వేదపండితులు, అర్చక స్వాములతో వేద ఆశీర్వచనము చేయించి స్వామి వారి శేష వస్త్రముతో సత్కరించారు. అనంతరం లడ్డూ ప్రసాదం, స్వామి చిత్రపటం అందజేసినట్లు ఆలయ ఉపకమిషనర్ లీలాకుమార్ తెలిపారు. పెదకాకాని గ్రామానికి చెందిన శ్రీ మల్లేశ్వరస్వామి సేవా సమితి అధ్యక్షుడు బోయపాటి వెంకటరమణ 10 సిమెంట్ బల్లలను బహుకరించినట్లు తెలిపారు.

నేటి నుంచి శ్రీలక్ష్మీ నరసింహుని కల్యాణ మహోత్సవాలు

గుంటూరు రూరల్: మండలంలోని నల్లపాడులో కొలువైన శ్రీ పుష్పాద్రి లక్ష్మీ నరసింహస్వామి, ఆకాశ మల్లేశ్వరస్వామి క్షేత్రాల్లో ఆదివారం నుంచి స్వామివారి కల్యాణ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ శనివారం ప్రకటనలో తెలిపారు. మహోత్సవాల్లో భాగంగా ఆలయంలో స్వామివారికి ఉదయం సుప్రభాతసేవ, లలితాపారాయణం, పూలంగి సేవ, సహస్ర దీపాలంకరణ, రాత్రి 8 గంటలకు స్వామివారి శాంతి కల్యాణ మహోత్సవం జరగనుందని తెలిపారు. సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు జరుగుతాయని తెలిపారు.

వైభవంగా శ్రీలక్ష్మీ నరసింహ స్వామి జయంతి

తెనాలిటౌన్: స్థానిక నాజరుపేటలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో శనివారం స్వామివారి జయంతి ఉత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ కె.చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు, సహస్రనామార్చన వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 22వ తేదీన హనుమాన్ జయంతి, 25వ తేదీన స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించిన తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆనంద్, మహేష్, గాంధీ, రవిశర్మ పాల్గొన్నారు.

మురళీనాయక్ త్యాగాన్ని దేశం మరువదు

తెనాలిటౌన్: జమ్మూ కాశ్మీర్‌లో వీరమరణం పొందిన తెలుగు జవాన్ మురళీనాయక్ త్యాగాన్ని దేశం ఎన్నటికి మరువదని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు కందుల వేణువర్ధన్ పేర్కొన్నారు. శనివారం మారీసుపేటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టి పట్టుదలతో సైన్యంలో చేరిన తెలుగుబిడ్డ 25 సంవత్సరాల చిన్న వయస్సులోనే భారతమాత రక్షణ కోసం ప్రాణాలర్పించినట్లు చెప్పారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న మురళీనాయక్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ధైర్యసాహసాలు, త్యాగాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

వ్యభిచార గృహ నిర్వాహకులు అరెస్ట్

తెనాలిరూరల్: వ్యభిచార గృహాల నిర్వహణపై వచ్చిన సమాచారంతో పోలీసులు దాడి చేసి నిర్వాహకులను, విటులను అదుపులోకి తీసుకున్నారు. పట్టణ త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్ బాబు శనివారం వెల్లడించిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారంతో సిబ్బందితో కలిసి శుక్రవారం పాండురంగపేట కాలారి హాస్పటల్ సమీపంలో ఓ ఇంటిపై దాడి చేశారు. నిర్వాహకులైన ఇరువురు మహిళలను, మరో మహిళను, విటు డి ని అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఎస్ఐ ప్రకాశరావు చెంచుపేట ఇందిరానగర్ కాలనీలో ఓ ఇంటిపై దాడి చేసి, వ్యభిచారం గృహ నిర్వాహకులు ముగ్గురు, విటుడిని, మహిళను అదుపులోకి తీసుకున్నారు. రెండు ఘటనల్లో రూ.3 వేలు నగదు స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేశారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కొల్లిపర: మండల కేంద్రంలోని జనార్ధన స్వామి వారి దేవాలయం ఎదురుగా ఉన్న ప్రధాన కూడలిలో మండల స్థాయి ప్రజా సమస్యల ప్రజావేదిక సోమవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జి.సిద్ధార్థ తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరై వినతి పత్రాలు స్వీకరిస్తారని తెలిపారు. సభ అనంతరం రాత్రి మండల కేంద్రంలోనే మంత్రి పల్లె నిద్ర కార్యక్రమం చేపడతారన్నారు.

నేడు వాకర్స్ క్లబ్ సమావేశం

తెనాలిటౌన్: స్థానిక నందులపేట కవిరాజా పార్కులోని వడ్లమూడి గోపాలకృష్ణయ్య స్మారక సీనియర్ సిటిజన్స్ భవనంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు వాకర్స్ క్లబ్ ఏప్రిల్, మే నెల సమావేశాలు నిర్వహించనున్నట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి డాక్టర్ వెంకటేష్ పోట్రు ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని తెలిపారు. మధుమేహ వ్యాధి వలన వచ్చే దీర్ఘకాలిక వ్యాధులు, వాటిని అరికట్టడం ఎలా అనే అంశంపై డాక్టర్ వెంకటేష్ ప్రసంగిస్తారు.

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసేంత వరకు పోరాటం

జిల్లా కార్మిక సదస్సులో నాయకుల పిలుపు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

లక్ష్మీపురం: కార్మికుల హక్కులకు భంగం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసేందుకు పోరాటం కొనసాగుతోందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమాదేవి పేర్కొన్నారు. ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం కోరుతూ కార్మిక సదస్సు శనివారం నిర్వహించారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో నిర్వహించిన సమావేశానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. తొలుత దేశ రక్షణలో వీర మరణం పొందిన మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరించడమే లక్ష్యంగా కేంద్రంలో ఉన్నటువంటి ఎన్డీఏ ప్రభుత్వం పని చేస్తుందని ఆరోపించారు. బ్రిటిష్ వారితో పోరాడి సాధించుకున్నటువంటి కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లను తయారు చేసి బలవంతంగా కార్మికులపై రుద్దే ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కుట్రపూరిత, కుయుక్తులను పోరాటంతోనే ఎదుర్కొంటామని ఈనెల 20న జరగబోతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ఎన్డీఏ ప్రభుత్వానికి చెంపపెట్టని అన్నారు. వైఎస్సార్టీయూ జిల్లా అధ్యక్షుడు పవన్ మాట్లాడుతూ దశల వారి ఆందోళనలతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసేంతవరకు పోరాటం నిర్వహిస్తామని చెప్పారు. 12, 13వ తేదీలలో వాణిజ్య, వర్తక సంఘాలకు సమ్మె నోటీసులు అందిస్తూ సహకారం కోరుతామని, 14,15 తేదీలలో ఆటోల ద్వారా ప్రచారం నిర్వహిస్తామని, 17,18 తేదీలలో బైక్ ర్యాలీల ద్వారా ప్రజలకు సమ్మె యొక్క ప్రాధాన్యం తెలియజేస్తామని చెప్పారు.

రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి కౌన్సెలింగ్

నేరాల నియంత్రణలో నూతన ప్రక్రియకు ఎస్పీ నాంది



రౌడీషీటర్ ఖాసిం వలికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

తెనాలిరూరల్: నేర నింత్రణకు, శాంతి భద్రతల పరిరక్షణకు ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇందుకు సరికొత్త విధానానికి నాందీ పలికారు. సాధారణంగా రౌడీషీటర్లను ఆయా పోలీస్‌స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తుంటారు. కొన్ని సందర్భాల్లో గుంటూరులోని డార్మెటరీకి పలిపించి కౌన్సెలింగ్ ఇస్తారు. ఇందుకు భిన్నంగా పరికొత్త ప్రక్రియను ఎస్పీ తెనాలిలో చేపట్టారు. రౌడీషీటర్ల ఇళ్లకు స్వయంగా వెళ్లి రౌడీషీటర్లతో పాటు వారి కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్ల కదలికలపై వివరాలు సేకరించేందుకు శనివారం తెనాలి వచ్చిన ఆయన పట్టణంలోని టూ టౌన్, త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం రౌడీషీటర్లు, వారి కదలికలు, వారిపై ఉన్న కేసులు, వారు కౌన్సిలింగ్‌కు స్టేషన్‌కు హాజరవుతున్న వివరాలను డీఎస్పీ బి. జనార్ధనరావు ద్వారా తెలుసుకున్నారు. యడ్ల లింగయ్య కాలనీ, మారిస్‌పేట, పాండురంగ పేట, ఐతానగర్ తదితర ప్రాంతాలలో రౌడీ షీటర్ల ఇళ్లకు వెళ్లి, వారి కుటుంబసభ్యులతో ఆయన మాట్లాడారు. కుటుంబ నేపథ్యాన్ని కూడా తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న రౌడీషీటర్లకు ఆయన నేరుగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రౌడీషీటర్ల ఆగడాలకు పూర్తిస్థాయిలో కళ్లెం వేసే దిశగా పనిచేస్తున్నామని, కచ్చితంగా మెరుగైన ఫలితాలు సాధిస్తామని చెప్పారు. జిల్లాలో రౌడీషీటర్ల కదలికలపై పోలీసుల నిఘా, వారికి నిర్వహిస్తున్న కౌన్సెలింగ్, రౌడీ షీటర్లు కౌన్సిలింగ్కు హాజరవుతున్నారా లేదా అన్న విషయాలను తెలుసుకునేందుకు పర్యటించినట్లు చెప్పారు. రౌడీషీటర్ల ఆగడాలకు పూర్తిస్థాయిలో చెక్ పెట్టే యోచనలో ఉన్నామన్నారు. గతంలో వారిపై ఉన్న కేసులను కూడా పరిశీలిస్తున్నామని, వాటిలో త్వరితగతిన శిక్షలు పడే విధంగా ప్రయత్నిస్తున్నామన్నారు. కేసులలో ఉన్నవారు తిరిగి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని ఉపేక్షించేది లేదన్నారు. రౌడీషీటర్ విజయ్‌పై పీడీ యాక్ట్ ప్రయోగించామని, త్వరలో మరికొందరిపై కూడా యాక్ట్ ప్రయోగిస్తామన్నారు. రూ.5 లక్షల పూచీ కత్తుతో బైండోవర్ జరుగుతుందని, నిబంధనలను ఉల్లంఘించిన వారు రూ. 5 లక్షలు జరిమానా చెల్లించాలని లేనిపక్షంలో జైలు శిక్ష తప్పదన్నారు. ఇటీవల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన రౌడీషీటర్ అన్నం రమేష్‌కు ఎగ్జిక్యూటివ్ మ్యాజిస్ట్రేట్ కేవీ గోపాలకృష్ణ రిమాండ్ విధించిన సంగతి గుర్తుచేశారు. రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట డీఎస్పీ బి. జనార్ధనరావు, సీఐలు వి. మల్లికార్జునరావు, రాములు నాయక్, ఎస్.రమేష్‌బాబు, ఎస్ఐలు ఉన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణరాయబార ఘట్టం



శ్రీకృష్ణరాయబారం నాటకంలో సన్నివేశం

తెనాలిటౌన్: శ్రీ దుర్గాభవానీ నాట్యమండలి తెనాలివారిచే ప్రదర్శించిన శ్రీకృష్ణరాయభారం పాన్పు సీను పౌరాణిక నాటకం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. రూరల్ మండలం కొలెవరం గ్రామంలో నిర్వహిస్తున్న బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా ప్రదర్శిస్తున్న పౌరాణిక, సాంఘిక నాటకాలు ప్రజలను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం రాత్రి ప్రదర్శించిన శ్రీకృష్ణరాయభారం నాటకంలో కృష్ణుడిగా తాడిబోయిన నాగేశ్వరరావు, అర్జునుడిగా మున్నంగి శ్రీనివాసరావు, దుర్యోధనుడిగా కె.అశోక్‌కుమార్ నటించి ప్రేక్షకులను మెప్పించారు. అదే విధంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు రచించి నటించిన సింహంమంటి చిన్నోడు సాంఘిక నాటకం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. సమకాలిన రాజకీయాలను అద్దంపట్టే సన్నివేశాలు నాటికలో ప్రదర్శించారు. ఈ నాటకంలో బెల్లంకొండ వెంకట్, తాడిబోయిన నాగేశ్వరరావు, ఆరాధ్యుల ఆదినారాయణ, పి.అశోక్ గజపతిరాజు, విజయసారథి, హైమారావు, రామరాజు, శ్రీనివాసరావు, శంకరరావు, గోపిరాజు, మన్నవరాజు, కమలి, సంధ్య నటించారు. నాటక ప్రదర్శన అనంతరం నటీనటులను నిర్వాహకులు దుశాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మురుగు రోడ్లపై పారకుండా చర్యలు తీసుకోండి

మంత్రి మనోహర్



మారీసుపేటలో పర్యటిస్తున్న మంత్రి మనోహర్

తెనాలిఅర్బన్: రోడ్డుపై మురుగు ఎందుకు పారుతుంది? మీరు చూసుకోరా అంటూ రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మున్సిపల్ పారిశుద్ధ్య విభాగ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మారీసుపేట రేపల్లె గేటు సమీపంలో పర్యటించారు. మురుగు కాల్వలు పొంగి రోడ్లపైకి రావడాన్ని గమనించిన ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు మీలో మార్పు రావడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ఆదేశాలతో కమిషనర్ బండి శేషన్న ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పినపాడు రైల్వేట్రాక్ సమయంలో అధికారులు కల్వర్టు నిర్మిస్తు కాల్వలను మూసి వేయడం వలన రోడ్లపైకి మురుగు చేరుతున్నట్లు ఆయన గమనించారు. వెంటనే ఆయన రైల్వే అధికారులతో మాట్లాడి కాల్వల్లో వేసిన గండిని తొలగించారు.

మాజీ చైర్‌పర్సన్ వెంకట్రావుకు సతీవియోగం

తెనాలిఅర్బన్: మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పెండేల వెంకట్రావుకు సతీవియోగం జరిగింది. ఆయన సతీమణి పద్మావతి (70) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మారీసుపేటలోని ఆయన నివాసానికి వెళ్లారు. పద్మావతి పార్థవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శనివారం ఉదయం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా అక్కడకు వెళ్ళి నివాళులర్పించారు.